సాక్షి
రాజన్న సిరిసిల్ల

శనివారం । 8 । ఏప్రిల్ । 2023



వీర్నపల్లిలో బలగం ప్రదర్శన

వీర్నపల్లి(సిరిసిల్ల): వీర్నపల్లిలో సర్పంచ్ దిన కర్, పాలకవర్గం సభ్యుల ఆధ్వర్యంలో శుక్ర వారం రాత్రి బలగం సినిమా ప్రదర్శించారు.



సర్పంచులకు సన్మానం

వేములవాడ: ఉత్తమ జీపీలు ఎగ్లాస్‌పూర్, నాగారం, మర్తనపేట సర్పంచులు దండి ఎల్లవ్వ, బాన లావణ్య, వంశీకృష్ణారావులను ఎమ్మెల్యే రమేశ్‌బాబు సన్మానించారు.

గరిష్ఠం/కనిష్ఠం
32.0/23.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురు గాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది.

దైవం దృష్టిలో రాజు రైతు, ధనిక పేద, కులం మతం, జాతి, వర్గ బేధాలు లేవు.
– మహ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
శని 6.34	ఆది 4.34

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

'కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న కేంద్రం'



మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

సిరిసిల్లటౌన్: కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ.. సామన్యులపై పన్నుల భారం మోపుతుందని సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకటరెడ్డి విమర్శించారు. సిరిసిల్లలోని కార్మికభవన్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'బీజేపీ హటావో, దేశ్ బచావో' నినాదంతో ముందుకెళ్తామన్నారు. పంతం రవి, సామల మల్లేశం, కదారి రాములు, సుదర్శన్, చంద్రమౌళి ఉన్నారు.

ఎస్టీయూ వజ్రధార ఆవిష్కరణ



ఎస్టీయూ వజ్రధార సంచికను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

సిరిసిల్లఎడ్యుకేషన్: రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆవిర్భవించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఎస్టీయూ రూపొందించిన వజ్రధార ప్రత్యేక సంచిక సావనీర్‌ను జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఉద్యమ సంఘంగా పేరొంది, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను గుర్తించి తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాలలో పాల్గొన్న విషయాన్ని గుర్తుచేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు మొగిలి లక్ష్మణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రేవోజు సదానందం, చాట్ల మల్లేశం, బొగ్గారపు నవీన్, మేడపట్ల కిషన్, జాకీర్, తిరుపతి, గడ్డం శ్రీను, జడల ప్రశాంత్ పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న మురళీధర్‌రావు

సిరిసిల్లఅర్బన్: ఆరోగ్య పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ మురళీధర్‌రావు పేర్కొన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేటలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సైకాలజిస్ట్ పున్నం చందర్ ఆధ్వర్యంలో మైండ్‌కేర్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఆస్పత్రి వైద్యులు మురళీధర్‌రావు, పత్తిపాక రఘు హాజరై మాట్లాడారు. ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలన్నారు. కమ్యూనిటీ ఫెసిలిటేటర్ మార్కండేయులు, హెల్పింగ్ హార్ట్స్ అధ్యక్షుడు అలువాల ఈశ్వర్, సఖీ సెంటర్ రోజా, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గడ్డం ప్రసాద్, ప్రభాకర్, మైండ్‌కేర్ సిబ్బంది ఉన్నారు.

పురాతన ఆలయాలను పరిరక్షిద్దాం



ఆలయ పరిసరాలు పరిశీలిస్తున్న నాయకులు

ముస్తాబాద్(సిరిసిల్ల): పురాతన ఆలయాల పరిరక్షణకు ప్రత్యేక కమిటీలు వేసి బాగు చేసుకోవాల్సిన అవసరం ఉందని ఎంపీపీ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య పేర్కొన్నారు. ముస్తాబాద్‌లోని పురాతన శ్రీవేణుగోపాలస్వామి ఆలయాన్ని శుక్రవారం పరిశీలించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ద్వారా ప్రాచీన ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా చూస్తామన్నారు. ఎంపీపీ తన వంతుగా రూ.5లక్షల విరాళాన్ని ఆలయ పనుల కోసం ఇస్తానని ప్రకటించారు. సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్, నర్సింహారెడ్డి, రమేశ్‌రెడ్డి, సంతోష్‌రావు, నల్ల నర్సయ్య, స్వామి, నర్సింలు, మనోహర్, నందు పాల్గొన్నారు.

వైభవంగా రాములోరి రథోత్సవం



గంభీరావుపేట(సిరిసిల్ల): శ్రీసీతారామస్వామి గోవిందా.. గోవిందా.. నామస్మరణలతో గంభీరావుపేట పుర వీధులు మారుమోగాయి. మండలకేంద్రంలో సీతారామస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం రథోత్సవం కనులపండువగా సాగింది. ఏడంతస్తుల రథంపై స్వామివారు దర్శనమిచ్చారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. వేలాది మంది భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు. ఏడు వందల ఏళ్లుగా వెలుగుతున్న నంద దీపాన్ని భక్తులు దర్శించుకొని తరించారు.



రాజన్నకు జనహారతి

వేములవాడ: వేములవాడ రాజన్నను శుక్రవారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలకు వరుస సెలవులు రావడంతో భక్తుల తాకిడి పెరిగింది. తలనీలాలు సమర్పించిన భక్తులు, ధర్మగుండంలో స్నానాలు చేసిన అనంతరం కోడెమొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ ఆవరణ రద్దీగా మారింది. రాజన్న దర్శనం అనంతరం చాలా మంది భక్తులు బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు.



భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రై డే

సిరిసిల్లకల్చరల్: గుడ్ ఫ్రై డే సందర్భంగా రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రార్థన మందిరాలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక బీవై నగర్, ఆటోనగర్, బోనాల సుభాష్‌నగర్ ప్రార్థన మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సీఎస్ఐ సెయింట్ మార్క్ చర్చిలో రెవరెండ్ సుధాకర్, బీవైనగర్ చర్చిలో రెవరెండ్ శ్యామ్ కల్వల, పాస్టర్ మోజెస్ క్రీస్తు ప్రవచనాలు వినిపించారు. సెక్రెటరీ నాలుక సత్యం, కోశాధికారి జి.నర్సయ్య, కమిటీ సభ్యులు డి.రవికుమార్, సుశీలధర్మయ్య, జి.కనకమ్మ, విజయ్, సుదీప్‌కుమార్, ఏలియా, అనంతరావు, ప్రేమానందం పాల్గొన్నారు.

జిల్లాలో సౌరవెలుగులు

- నిత్యం 55 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి
- నాలుగు కేంద్రాల్లో ఉత్పత్తి
- రామాజిపేట, పెద్దలింగాపూర్, నూకలమర్రి, నామాపూర్‌లలో కేంద్రాలు
- ఎన్పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్‌తో ఒప్పందాలు
- విద్యుత్ సబ్‌స్టేషన్లకు అనుసంధానం



రామాజిపేటలోని సౌరవిద్యుత్ ప్లాంటు



సౌరవిద్యుత్ ప్లాంటు పలకలు

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలో సౌరవిద్యుత్ వెలుగులు విస్తరిస్తున్నాయి. ఎండలు ముదురుతున్న సమయంలో రికార్డుస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. జిల్లాలోని విద్యుత్ వినియోగదారుల అవసరాలను సౌరవిద్యుత్ తీర్చుతోంది. సహజ సిద్ధమైన సౌరవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు జిల్లాలో నాలుగు ఉన్నాయి. ఈ కేంద్రాల్లో నిత్యం ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌ను నేరుగా సబ్‌స్టేషన్లకు అనుసంధానించారు. జిల్లాలో నాలుగు ప్రైవేటు సౌరశక్తి ఆధారిత విద్యుత్‌ప్లాంట్లు ఉన్నాయి. ఎన్పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్‌తో ఒప్పందం చేసుకుని విద్యుత్‌ను సరఫరా చేస్తున్నాయి.

నిత్యం 55 మెగావాట్ల ఉత్పత్తి

ఇల్లంతకుంట మండలం రామాజిపేటలో 150 ఎకరాల్లో సూర్యరశ్మి ఆధారిత విద్యుత్ ఉత్పత్తిప్లాంట్ ఏర్పాటు చేశారు. నిత్యం 30 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. నేరుగా సిరిసిల్ల శివారులోని పెద్దూరు 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు విద్యుత్‌ను అందిస్తున్నారు. పెద్దలింగాపూర్‌లోనూ 120 ఎకరాల్లో సౌరశక్తి విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ నిత్యం 10 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సాగుతుంది. దీనిని పెద్దలింగాపూర్‌లోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు అనుసంధానించారు. వేములవాడ మండలం నూకలమర్రిలోనూ 100 ఎకరాల్లో సౌరశక్తి ఆధారిత విద్యుత్‌ప్లాంటు ఉంది. ఇక్కడ నిత్యం 15 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. దీనిని మల్లారంలోని 132 కేవీ సబ్‌స్టేషన్‌కు అనుసంధానించారు. జిల్లాలోని విద్యుత్ వినియోగదారులకు సౌర విద్యుత్ అందుబాటులోకి వచ్చింది.

ఎండలు ఉంటేనే కరెంట్

జిల్లాలో మూడు ప్లాంట్ల నుంచి విద్యుత్ సరఫరా అవుతుంది. ఎండలు బాగా ఉంటేనే విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. మేఘావృతమై ఉంటే ఉత్పత్తి నిలిచిపోతుంది. మబ్బులు పట్టినా, వర్షాలు పడినా కరెంట్ ఉత్పత్తి కాదు. ఇప్పుడు ఎండలు మండుతుండడంతో విద్యుత్ ఉత్పత్తి రికార్డు స్థాయిలో సాగుతుంది. ఒక్కో మెగావాట్ విద్యుత్ విలువ 6వేల యూనిట్లు అంటే జిల్లాలో ప్రస్తుతం 55 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. అంటే రోజు 3.30 లక్షల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఒక్కో యూనిట్‌ను రూ.6.50 నుంచి రూ.7 వరకు సీజన్‌ను బట్టి ఎన్పీడీసీఎల్ కొనుగోలు చేసి వినియోగదారులకు అందిస్తుంది. థర్మల్ విద్యుత్ ఉత్పత్తి ఖరీదు ఎక్కువ కావడంతో సౌరశక్తి ఆధారిత విద్యుత్‌ను వినియోగించుకుంటున్నారు.

నామాపూర్ టు సిద్దిపేట

ముస్తాబాద్ మండలం నామాపూర్‌లోనూ 200 ఎకరాల్లో సౌరశక్తి ఆధారిత విద్యుత్ ప్లాంటు ఏర్పాటు అవుతుంది. ఓ ప్రైవేటు కంపెనీ ఇక్కడ ఏర్పాటు చేసింది. ఇక్కడ ఉత్పత్తి అయిన విద్యుత్‌ను సిద్దిపేట, మెదక్ జిల్లాల పరిధిలోని ఎస్పీడీసీఎల్‌కు అందిస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం నాలుగు సోలార్ ఎనర్జీ ప్లాంట్లు ఉండగా.. మూడు రాజన్న సిరిసిల్ల జిల్లా వినియోగదారులకు అందిస్తున్నాయి. నామాపూర్ ప్లాంటు సిద్దిపేట జిల్లా పరిధిలోని సబ్‌స్టేషన్లకు సరఫరా చేస్తుంది. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రాజక్కపేట వద్ద రేకులకుంట సమీపంలోనూ మరో సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంటు ఉంది. వ్యవసాయ యోగ్యం కాని భూముల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేశారు. సౌరశక్తి విద్యుత్‌ను గ్రిడ్‌తో అనుసంధానం ఉండడంతో అవసరాన్ని బట్టి వినియోగించుకునే వీలుంటుంది. కరెంట్‌ను ఉత్పత్తి చేయడం.. వినియోగించడం జరిగిపోతుంది. విద్యుత్‌ను పెద్దగా నిల్వ చేసే అవకాశాలు లేవు. సౌరశక్తి ఆధారిత విద్యుత్ కేంద్రాలు రాజన్న సిరిసిల్ల జిల్లాలో వెలుగులను పంచుతున్నాయి.

అభివృద్ధికి పట్టం.. వసతులకు అందలం

- జాతీయ ఉత్తమ పంచాయతీగా గంభీరావుపేట
- ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం

గంభీరావుపేట(సిరిసిల్ల): కేంద్రం ప్రకటించిన జాతీయ ఉత్తమ గ్రామపంచాయతీల జాబితాలో గంభీరావుపేట మేజర్ గ్రామపంచాయతీకి చోటుదక్కింది. అన్ని రకాల మౌలిక వసతులు, స్వయం సమృద్ధి సాధించిన గ్రామపంచాయతీగా గంభీరావుపేట అవార్డు దక్కించుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా 8 జీపీలను ఉత్తమ గ్రామపంచాయతీలుగా ప్రకటించింది. అందులో గంభీరావుపేటతోపాటు పెద్దపల్లి జిల్లాలోని ఎలిగేడుకు చోటుదక్కాయి. గంభీరావుపేట పంచాయతీ ఏర్పడినప్పటి నుంచి ఎలాంటి అవార్డు అందుకోలేదు. జాతీయ ఉత్తమ గ్రామపంచాయతీగా ఎన్నికవడంపై స్థానికుల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. అన్ని విభాగాల్లో గంభీరావుపేట అత్యుత్తమంగా నిలిచి అవార్డుకు ఎంపికైంది. రాష్ట్రంలోనే తొలి కేజీ టు పీజీ ప్రాంగణం గంభీరావుపేటలోనే ఏర్పాటుకావడం, గంభీరావుపేట పీహెచ్‌సీ సామాజిక ఆరోగ్య కేంద్రంగా మారి మెరుగైన వైద్య సేవలు అందిస్తోంది. హరితహారం, సీసీరోడ్లు, డ్రెయినేజీలతోపాటు అన్ని రకాల ప్రభుత్వ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో అమలు పరుస్తుండడం అవార్డు దక్కడానికి కారణాలుగా నిలిచాయి.

అందరి సహకారంతోనే..



గ్రామ ప్రజలు, అధికారులు, పాలకవర్గం అందరి సహకారంతోనే గంభీరావుపేటకు జాతీయ ఉత్తమ పంచాయతీగా అవార్డు దక్కింది. అభివృద్ధికి, సంక్షేమ పథకాల అమలులో సహకరిస్తున్న మంత్రి కేటీఆర్, టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావుకు కృతజ్ఞతలు. గంభీరావుపేటను మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్లడానికి కృషి చేస్తాం. అవార్డు రావడం సంతోషంగా ఉంది. బాధ్యత మరింత పెరిగిందని భావిస్తున్నాను. – కటకం శ్రీధర్‌పంతులు, సర్పంచ్

ప్రివిలేజ్ కమిటీ ఎదుట నిలబెడతా

- కరీంనగర్ పోలీసుల తీరుపై మండిపడ్డ బండి
- కోర్టుకు సైతం ఈడుస్తానని ప్రతిన
- కర్మ జరుగుతున్న ఇంట్లో విధ్వంసం సృష్టించారని ఆక్రోశం
- సంజయ్ విడుదలతో బీజేపీలో ఉత్సాహం
- భారీ ఊరేగింపు, గజమాలలతో సత్కారం
- జైలు పరిసరాల్లో 144వ సెక్షన్



కోర్టు చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ బండి సంజయ్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/కరీంనగర్ క్రైం/ కరీంనగర్‌టౌన్: ఇటీవల మరణించిన తన అత్తమ్మ కర్మ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన తనతో దురుసుగా వ్యవహరించిన కరీంనగర్ పోలీసులను పార్లమెంటు ప్రివిలేజ్ కమిటీ ఎదుట నిలబెడతానని ఎంపీ బండి సంజయ్ అన్నారు. పదో తరగతి పేపర్ లీకేజీ కుట్రలో ఆరోపణలు ఎదుర్కొంటున్న కేసులో కరీంనగర్ జైల్లో రిమాండ్‌లో ఉన్న ఆయన శుక్రవారం ఉదయం బెయిల్‌పై విడుదలయ్యారు. అనంతరం బండి పోలీసులు, ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తన అత్తమ్మ మరణిస్తే.. తొమ్మిదవ రోజు (కర్మ) కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన తనని ఎలాంటి నోటీసులు లేకుండా అరెస్టు చేయడంపై మండిపడ్డారు. ఎలాంటి నోటీసులు, వారెంట్లు లేకుండా చట్టవిరుద్ధంగా కనీసం పార్లమెంటు సభ్యుడిని అన్న గౌరవం లేకుండా దురుసుగా అరెస్టు చేశారని ఆరోపించారు. ఇంట్లో తన అత్తమ్మ కార్యక్రమం కోసం తెచ్చిన సామగ్రి, టెంట్లు చిందరవందర చేశారన్నారు. తనను గంటలకొద్దీ జీపుల్లో తిప్పి వరంగల్ పోలీసులకు అప్పగించినందుకు కరీంనగర్ పోలీసులను ప్రివిలేజ్ కమిటీ ఎదుట నిలబెడతానన్నారు. వీలుంటే కోర్టుకు కూడా ఈడుస్తానని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కరీంనగర్‌లో హై అలర్ట్

- బండి సంజయ్ విడుదల నేపథ్యంలో.. కరీంనగర్‌లో హై అలర్ట్ నెలకొంది. పదోతరగతి పేపర్ లీకేజీ కేసులో అరెస్టయిన భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ శుక్రవారం జైలు నుంచి ఉదయం 9.02 గంటలకు విడుదలయ్యారు.
- జైలు పరిసర ప్రాంతాల్లో 144వ సెక్షన్ అమలు చేయడంతో మీడియా మినహా కార్యకర్తలెవరినీ జైలువద్దకు అనుమతించలేదు. కేవలం నలుగురైదుగురు ముఖ్య నాయకులు మాత్రమే జైలు వద్దకు చేరుకున్నారు.
- బండి విడుదల సందర్భంగా జైలుకు దారి తీసే రోడ్లన్నీ పోలీసులు బారికేడ్లతో మూసివేశారు. జైలు నుంచి బయటకు వచ్చిన సంజయ్ మొదటి మీడియాతో మాట్లాడారు. అనంతరం నేరుగా మహాలక్ష్మి దేవాలయానికి చేరుకొని అమ్మవార్లను దర్శించుకున్నారు. అక్కడి నుంచి సంజయ్ అత్తగారింటికి వెళ్లారు.
- ఇటీవల సంజయ్ అత్తమ్మ చిట్ల వనజ మృతిచెందగా ఆమె ఫొటోకు పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబసభ్యులతో కొద్దిసేపు మాట్లాడారు. సంజయ్ జైలు నుంచి విడుదలైన విషయం తెలుసుకొని జిల్లా నలుమూలల నుంచి కార్యకర్తలు సంజయ్ వద్దకు చేరుకున్నారు.
- జ్యోతినగర్‌లోని సంజయ్ అత్తమ్మ ఇల్లు కార్యకర్తలతో కిక్కిరిసిపోయింది. అక్కడి నుంచి కార్యకర్తలతో కలిసి భారీ ఊరేగింపుగా కోర్టు చౌరస్తాకు చేరుకున్నారు. అప్పటికే సంజయ్ కోర్టు చౌరస్తాకు వస్తారనే విషయం తెలుసుకుని భారీగా కార్యకర్తలు చేరుకున్నారు.
- కార్యకర్తల కోలాహలం మధ్య అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అక్కడే క్రేన్ ఏర్పాటు చేసి సంజయ్‌ను భారీ గజమాలతో సత్కరించారు. కోర్టు చౌరస్తా నుంచి రేకుర్తి రాజశ్రీ గార్డెన్ వెళ్లే క్రమంలో భారీ ఊరేగింపుతో సంజయ్ ఎస్ఆర్ఆర్ కళాశాల వరకు పాదయాత్ర నిర్వహించారు.
- రేకుర్తి చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి సైతం పూలమాల వేసి నివాళి అర్పించి, రాజశ్రీగార్డెన్‌కు చేరుకొని కార్యకర్తలతో మాట్లాడారు. సాయంత్రం 3.30 గంటలకు బీజేపీ రాష్ట్ర ఇంచార్జి తరుణ్‌చుగ్ సంజయ్ అత్తమ్మ ఇంటికి చేరుకొని వనజ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించడంతోపాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అక్కడే 4 గంటలకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.
- బండి సంజయ్ జైలు నుంచి ఇంటికి వచ్చిన అనంతరం బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్‌చుగ్ బండి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బండి సంజయ్ తల్లి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా 'మీరు బాధపడాల్సిన పనిలేదు, మీ కొడుకు వారియర్' అని అభివర్ణించారు.
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ విడుదల అనంతరం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అడిషనల్ డీసీపీలు శ్రీనివాస్, చంద్రమోహన్, ఏసీపీలు తుల శ్రీనివాస్‌రావు, కరుణాకర్‌రావు, విజయ్‌కుమార్, సీఐలు, ఎస్సైలు గట్టి బందోబస్తు నిర్వహించారు.
- మాజీ ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా బీజేపీ ఇన్‌చార్జి ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి క్రిష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, వాసుదేవారెడ్డి, బీజేపీ పార్లమెంట్ అధ్యక్షుడు బోయిన్‌పల్లి ప్రవీణ్‌రావు, మాజీ జిల్లా అధ్యక్షుడు బాస సత్యనారాయణరావు, నాయకులు కటుకం లోకేశ్, పుల్లెల పవన్‌కుమార్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సింగరేణి ప్రైవేటీకరణపై జంగ్ సైరన్

- ప్రధాని పర్యటన నేపథ్యంలో కోల్‌బెల్ట్ ప్రాంతంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహాధర్నా
- పార్టీ అధిష్టానం ఆదేశాలతో గోదావరిఖనిలో విస్తృత ఏర్పాట్లు
- కోల్‌బెల్టు నేతలకు ఫోన్‌లో దిశానిర్దేశం చేసిన సీఎం

సాక్షి, పెద్దపల్లి: ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో కోల్‌బెల్ట్ ప్రాంతంలో మహాధర్నాకు బీఆర్ఎస్ పార్టీ సిద్ధమవుతోంది. సింగరేణి బొగ్గుగనుల వేలం వేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయానికి వ్యతిరేకంగా కోల్‌బెల్టు ప్రాంతాల్లో 'మహా ధర్నాలతో' జంగ్ సైరన్ మోగించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తుంది. ఇందులో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బొగ్గు గనులకు నిలయమైన గోదావరిఖనిలో శనివారం సింగరేణి కార్మికులు, కార్మికసంఘాల నేతలు, మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, పార్టీ శ్రేణులతో మహాధర్నా నిర్వహించనున్నారు. జెడ్పీ చైర్మన్ పుట్టమధు భూపాలపల్లి జిల్లాలో నిర్వహించే మహాధర్నాలో పాల్గొననున్నారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ప్రజాక్షేత్రంలో బీజేపీకి గుణపాఠం చెప్పేలా మహాధర్నా విజయవంతం చేసేందుకు శ్రేణులు సమాయత్తం అవుతున్నాయి.

కోల్‌బెల్టు నేతలకు సీఎం ఫోన్..!

సింగరేణి సమస్య కేవలం ఆరు జిల్లాల సమస్య కాదని, తెలంగాణ ఆర్థిక ప్రగతిని దెబ్బతీసే కుట్రలో భాగంగానే బొగ్గు గనుల వేలంకు కేంద్రం యత్నిస్తుందని ఇప్పటికే బీఆర్ఎస్ అధిష్టానం పోరుబాటను ఎంచుకుంది. దీనిలో భాగంగా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గత గురువారం మహాధర్నాకు సంబంధించి కేటీఆర్ సింగరేణి పరిధిలోని పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలతో మాట్లాడగా, శనివారం నిర్వహించే నిరసన కార్యక్రమాలపై శుక్రవారం సీఎంవో కార్యాలయం నుంచి సీఎం కేసీఆర్ ఫోన్‌లో దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. దీంతో గోదావరిఖనిలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే కొరుకంటి చందర్ బీఆర్ఎస్ శ్రేణులతో సమావేశమై మార్గనిర్దేశం చేశారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు గోదవరిఖని ప్రధాన చౌరస్తాలో నిర్వహించే మహాధర్నాకు కార్మికులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

నిందితులకు శిక్షపడేలా కృషి చేయండి

- సైంటిఫిక్ ఆధారాలు జతచేయాలి
- ఎస్పీ అఖిల్ మహాజన్



సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్, హాజరైన కోర్టు డ్యూటీ అధికారులు

సిరిసిల్లక్రైం: పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేయడంతోపాటు నిందితులకు శిక్షపడేలా పనిచేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం కోర్టు డ్యూటీ అధికారులతో సమీక్షించారు. నేరస్తులకు శిక్షపడేలా చేయడం, శిక్షల శాతాన్ని పెంచడం ద్వారా సమాజంలో మంచి మార్పు తీసుకురావచ్చన్నారు. న్యాయాధికారులతో సమన్వయం చేస్తూ, పెండింగ్ కేసుల పురోగతిని పరిశీలిస్తూ, ఉన్నతాధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. నేటికాలంలో సాంకేతికత కీలకంగా మారిందని అన్ని కేసుల్లో సైంటిఫిక్ ఆధారాలు జతచేయాలని సూచించారు. కోర్టు కేసులకు సంబంధించిన ప్రధాన కేసుల్లో నిందితులకు జీవితఖైదు పడేలా కృషి చేయాలని, అప్పుడే తప్పు చేయాలంటే భయం, ప్రజలకు పోలీసులపై నమ్మకం కలుగుతుందన్నారు. శిక్షల శాతం పెరిగేలా పనిచేసే అధికారులు, సిబ్బందికి రివార్డులు అందజేస్తామన్నారు. ప్రాసిక్యూషన్‌లో భాగంగా కోర్టు జారీచేసిన నాన్ బెయిలబుల్ వారెంట్లను క్రమం తప్పకుండా అమలు చేయాలని తెలిపారు. సీఐ కిరణ్‌కుమార్, కోర్టు డ్యూటీ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డీఎస్పీ విచారణ



విచారణ చేపడుతున్న డీఎస్పీ

కోనరావుపేట: మండలంలోని మరిమడ్లలో విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందగా డీఎస్పీ విచారణ చేపట్టారు. అజ్మీరాతండాకు చెందిన భుక్యా కిషోర్ అనే యువకుడు వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలకు తగిలి మృతిచెందాడు. డీఎస్పీ నాగేంద్రచారి మరిమడ్లలో శుక్రవారం విచారణ జరిపారు. సంఘటనా స్థలం వద్ద విద్యుత్ తీగలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న వేటగాళ్లపై నిఘా ఉంచాలన్నారు. ఇక్కడ సీఐ కిరణ్‌కుమార్, ఎస్సై రమాకాంత్, సిబ్బంది ఉన్నారు.

మలేసియాలో జిల్లావాసి మృతి

వీర్నపల్లి: మండలంలోని సీతారాంనాయక్ తండాకు చెందిన భానోత్ బావ్‌సింగ్ (60) మలేషియాలో మృతిచెందాడు. బావుసింగ్ మూడేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం మలేషియాకు వెళ్లాడు. మూడురోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురికాగా తోటిమిత్రులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం విధులకు వెళ్లకుండా గదిలోనే ఉన్నాడు. స్నేహితులు శుక్రవారం విధులకు వెళ్లొచ్చేసరికి గదిలో విగతజీవిగా పడి ఉన్నాడు. వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా గుండెపోటుతోనే బావుసింగ్ మృతిచెందినట్లు భావిస్తున్నారు. మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించాలని కుటుంబ సభ్యులు, సర్పంచ్ రవినాయక్ ప్రభుత్వాన్ని కోరారు.

సోదరభావంతో మెలగాలి



ఇఫ్తార్ విందులో నాయకులు, ముస్లింలతో ఆది శ్రీనివాస్

రుద్రంగి (వేములవాడ): హిందూ, ముస్లింలు సోదరభావంతో మెలగాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన రుద్రంగి కాంగ్రెస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ముస్లింలకు స్థానిక మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, నాయకులు, ముస్లింలు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైపై దురుసుగా ప్రవర్తించిన కానిస్టేబుల్

చందుర్తి (వేములవాడ) : కొండగట్టులో హనుమాన్ జయంతి సందర్భంగా బందోబస్తు విధుల్లో ఉన్న ఓ ఎస్సైతో కానిస్టేబుల్ దురుసుగా ప్రవర్తించాడు. ఆ కానిస్టేబుల్ ఎవరనేది చందుర్తిలో శుక్రవారం చర్చనీయాంశమైంది. ఘాట్‌రోడ్డు వద్ద డ్యూటీలో ఉన్న ఎస్సై సివిల్ డ్రెస్‌లో ఉన్న కానిస్టేబుల్‌ను ఆపాడు. నేను కానిస్టేబుల్‌నని బదులివ్వగా ఎస్సై ఐడీ కార్డు చూపించాలన్నాడు. నేనేమైనా దొంగనా, లంగనా అన్న కానిస్టేబుల్ మాటలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఆ కానిస్టేబుల్ ఎవరనేది తెలుసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ విషయమై చందుర్తి సీఐ కిరణ్‌కుమార్‌ను వివరణ కోరగా ఓ కానిస్టేబల్ పేరు చెప్పారు.

అటకెక్కిన భూసార పరీక్షలు



భూసార పరీక్ష కోసం మట్టిని సేకరిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు



రైతు వేదికలో మూలనపడిన పరికరాలు

- నిరుపయోగంగా కిట్లు
- పంటలసాగుపై అవగాహన కరువు..
- సంప్రదాయ సాగుతో నష్టపోతున్న రైతులు

చందుర్తి (వేములవాడ): గ్రామాల్లో భూసార పరీక్షలు అటకెక్కాయి. రైతులు భూసార పరీక్షలు చేయించుకొని అనువైన పంటలతో అధిక దిగుబడులు సాధించేందుకు ఐదేళ్ల క్రితం క్లస్టర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన మినీ భూసార కిట్లు నిరుపయోగంగా మారాయి. ల్యాబ్‌ల్లో కాకుండా గ్రామస్థాయిలో పరీక్షలు నిర్వహించేలా వ్యవసాయ శాఖ వెసులు బాటును కల్పిస్తూ 2018లో అందుబాటులోకి తెచ్చింది. మినీ యంత్రాలతో గ్రామస్థాయిలో మట్టి పరీక్షలు నిర్వహించే అవకాశం కల్పించింది. అందుకు మినీ భూసార పరీక్ష కేంద్రాలను వ్యవసాయ విస్తరణాధికారుల (ఏఈఓ) పరిధిలో క్లస్టర్ గ్రామాల్లో ఏర్పాటు చేశారు. భూసార కేంద్రాల్లో పరికరాలను అందుబాటులో ఉంచినా పరీక్షలు చేసేందుకు కావాల్సిన రసాయనిక కిట్లను ప్రభుత్వం సరఫరా చేయకపోవడంతో కిట్లు మూలనపడ్డాయి.

42 క్లస్టర్లకే కిట్లు

జాతీయ సుస్థిర వ్యవసాయాభివృద్ధి పథకంలో భాగంగా జిల్లాలో రైతులకు అందుబాటులో సేవలందించేందుకు 57 క్లస్టర్ గ్రామాలను ఏర్పాటు చేశారు. కానీ 42 క్లస్టర్లకే మినీ భూసార కిట్లను అందజేశారు. రైతులుకు అందుబాటులో మట్టి పరీక్షలు నిర్వహించేందుకు నమూనాలు సేకరించారు. రెండేళ్లపాటు సేవలందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరికరాలతో పాటు రసాయనిక కిట్లను అందజేశారు. ఇందులో కేంద్రం 40 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 60 శాతం వ్యయాన్ని కేటాయించారు. ప్రారంభించిన రెండేళ్లకే మట్టి పరీక్షలకు కావాల్సిన కిట్లను అందించకపోవడంతో పరికరాలు రైతు వేదికల్లో మూలనపడ్డాయి. మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్ష కార్డులను అందజేయాలన్న లక్ష్యాన్ని మర్చిపోయారు.

మట్టి నమూనాను సేకరించే విధానం..

- భూసార పరీక్షలకు రైతులు తమపంటల్లో మట్టిని సేకరించేందుకు ఖచ్చితమైన పద్ధతులున్నాయి.
- రైతులు పొలంలోని మట్టిని మూడేళ్లకోసారి పరీక్షలు చేయించుకుంటే మంచిది.
- పొలంలో 'వి' ఆకారంలో 15 సెం.మీ వరకు పారతో గుంట తీయాలి. అందులో పైపార నుంచి కింది పొర వరకు ఒక పక్కన ఉన్న మట్టిని మాత్రమే సేకరించాలి.
- సేకరించిన మట్టిలో రాళ్లు, పంటవేర్లు, మొదళ్లు లేకుండా చేసుకొని నీడలో ఆరబెట్టాలి.
- ఎకరం విస్తీర్ణంలో 8 నుంచి 10 చోట్లలో మట్టిని సేకరించి ఒకచోట చేర్చి బాగా కలిపి 4 భాగాలు చేయాలి.
- గట్లవద్ద, పంట కాలువల్లోని మట్టిని సేకరించవద్దు.
- చెట్ల కింద ఉన్న పొలం భాగంనుంచి మట్టిని సేకరించొద్దు.
- పశువుల పేడ, కంపోస్ట్, వర్మీ కంపోస్ట్, పచ్చిరొట్టి ఎరువులు కుప్పపోసిన చోట మట్టిని సేకరించొద్దు.

భూసార పరీక్షలతో ప్రయోజనాలు..

- రైతులు మూడేళ్లకోసారి భూసార పరీక్షలు చేయించుకోవాలి.
- నేలలో పోషక లోపాలను గుర్తించవచ్చు.
- భూమిలోని చౌడు గుణాలను, సున్నం శాతాన్ని, నేల కాలుష్యాన్ని గుర్తించేందుకు కూడా మృత్తిక పరీక్ష ఉపయోగపడుతుంది.
- ఎరువుల వాడకంలో అనవసరపు ఖర్చులు తగ్గించుకోవచ్చు.
- అధిక, సుస్థిర దిగుబడులను పొందవచ్చు.
- ఫలితాలను అనుసరించి నేలలకు అనువైన పంటలు, రకాలను సూచించవచ్చు.

భూసార పరీక్షలు నిర్వహించాలి



రైతులు ఏటా సంప్రదాయ పంటలు సాగుచేస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. దిగుబడి కోసం విచ్చలవిడిగా రసాయనిక ఎరువులను వినియోగిస్తున్నారు. పెట్టుబడుల ఖర్చు రెండింతలు పెరిగిపోతుంది. జాతీయ సుస్థిర వ్యసాయాభివృద్ధి పథకంలో భాగంగా భూసార పరీక్షలు నిర్వహించి, కార్డులు అందజేస్తే వాటికి అనుగుణంగా రైతులు పంటలు సాగుచేస్తారు.

– బానాల రవీందర్‌రెడ్డి, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు, చందుర్తి

కిట్లు అందిస్తే పరీక్షలు చేస్తాం



భూసార పరీక్షలు నిర్వహించేందుకు కావాల్సిన పరికరాలు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న కిట్లు కాలం చెల్లినవి. ప్రభుత్వం కిట్లను సరఫరా చేయడం లేదు. కిట్లను అందజేస్తే చేస్త పరీక్షలు నిర్వహిస్తాం. జిల్లాలోని రైతులు భూసార పరీక్షలు చేయించుకునే వారిని ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఉన్న ల్యాబ్‌లకు పంపించి భూసార పరీక్షల నివేదికలను అందజేస్తున్నాం.

– రణధీర్ కుమార్, జిల్లా వ్యవసాయాధికారి , రాజన్న సిరిసిల్ల

దేశానికే దళితబంధు ఆదర్శం

- మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్
- రైస్‌మిల్లు, హోటళ్లు పరిశీలన



రైస్ మిల్లును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి(సిరిసిల్ల)/ఇల్లంతకుంట(మానకొండూర్): దళితబంధు దేశానికే ఆదర్శమని.. ఈ పథకం ద్వారా దళితులను రైస్‌మిల్లులకు, పెట్రోల్‌బంకులకు, హోటళ్లకు యజమానులు చేయడం నా కలలో కూడా ఊహించలేదని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో దళితబంధులో భాగంగా ఏర్పాటు చేసిన రైస్‌మిల్లు, పెట్రోల్‌బంక్, హోటళ్లను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా రసమయి బాలకిషన్ మాట్లాడుతూ తరతరాలుగా వివక్ష, వెనుకబాటుకు గురైన దళితుల బతుకుల్లో అభివృద్ధి రేఖలు తీసుకురావాలని సీఎం కేసీఆర్ ఈ పథకాన్ని తీసుకొచ్చారన్నారు. ప్రతీ నియోజకవర్గంలో దళితబంధులో భాగంగా ఇలాంటి రైస్‌మిల్లు ఇండస్ట్రీని ఏర్పాటు చేసుకోవాలని లబ్ధిదారులను కోరారు.

మిర్చీలు తిని.. అభినందించి

వీర్నపల్లి మండలం రంగంపేటలో దళితబంధులో భాగంగా ఏర్పాటు చేసుకున్న కుమ్మరి దేవయ్య హోటల్‌లో ఎమ్మెల్యే రసమయి మిర్చీలు తిని.. 'చాలా రుచికరంగా ఉన్నాయి..' అని అభినందించారు.

చర్చి నిర్మాణానికి భూమిపూజ

ఇల్లంతకుంటలోని ఎవాంజలికల్ చర్చి నిర్మాణానికి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ భూమిపూజ చేశారు. అనంతరం గుడ్‌ఫ్రైడే వేడుకల్లో పాల్గొని మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం చర్చి నిర్మాణానికి నిధులు కేటాయించినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, ఎంపీపీలు పిల్లి రేణుక, వెంకటరమణారెడ్డి, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, నాయకులు బండారి బాల్‌రెడ్డి, పిల్లి కిషన్, శ్రీనివాస్‌గౌడ్, సర్పంచులు ఎడ్ల లక్ష్మీరాజం, భాగ్యలక్ష్మి, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, నాయకులు గజన్‌లాల్, హన్మండ్లు, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్యయాదవ్, ఏఎంసీ చైర్మన్ సంజీవ్, పాస్టర్ మోజెస్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి

- డీఎస్పీ నాగేంద్రచారి



పాల్గొన్న ఆటో యజమానులు, డ్రైవర్లు

వేములవాడ : వేములవాడకు వచ్చే భక్తులు, స్థానికుల పట్ల ఆటో డ్రైవర్లు మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని డీఎస్పీ నాగేంద్రచారి అన్నారు. స్థానిక మహాలింగేశ్వర గార్డెన్‌లో శుక్రవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ట్రాఫిక్ నియంత్రణ పాటించాలని, మద్యంతాగి ఆటోలు నడపవద్దని సూచించారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలించవద్దన్నారు. ఓవర్‌లోడ్‌తో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. సమావేశంలో టౌన్ సీఐ వెంకటేశ్, ఎస్సైలు రఫీక్‌ఖాన్, దిలీప్, ఆటో యూనియన్ అధ్యక్షుడు దేవరాజు, ఆటో డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి



పనులు ప్రారంభిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, ఎంపీపీ పిల్లి రేణుక అన్నారు. మండలంలోని దుమాలలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో సమస్యలను తమదృష్టికి తీసుకురావాలన్నారు. లూజువైర్లు, కొత్త స్తంభాల ఏర్పాటుపై దృష్టి సారిస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సర్పంచ్ కదిరె రజిత, ఉపసర్పంచ్ హనుమంతు, బాలకిషన్, రాజిరెడ్డి, బాబు, దావిద్, రవీందర్ రెడ్డి, బాలమల్లు, రాజం, కొమరయ్య, దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

కథలాపూర్ (వేములవాడ): మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన కల్లెడ లక్ష్మణ్(55) శుక్రవారం సాయంత్రం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..లక్ష్మణ్ మేస్త్రీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇద్దరు కూతుళ్ల వివాహం కోసం సుమారు రూ.10 లక్షలు అప్పు చేశాడు. అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో మనస్తాపానికి గురై లక్ష్మణ్ ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనా స్థలాన్ని ఏఎస్సై ఎండీ ఆలీమొద్దీన్ పరిశీలించారు. మృతుడి భార్య నర్సు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు



ఎమ్మెల్యే రమేశ్‌బాబుకు పూలమొక్కను అందజేస్తున్న కూర అంజిరెడ్డి

వేములవాడ : వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబును జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షుడు కూర అంజిరెడ్డి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు పూలమొక్కను అందించారు. ఈ సందర్భంగా రైతుల పంటలు, దిగుబడి, కొనుగోలుపై చర్చించారు.

వైభవంగా రథోత్సవం

బోయినపల్లి (చొప్పదండి) : మండలంలోని మాన్వాడ గ్రామంలో శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన స్వామివారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో లక్ష్మీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను రథంపై ఊరేగించారు.

గుండెపోటుతో ఇద్దరు యువకుల మృతి

- క్రికెట్ ఆడుతూ ఒకరు.. వ్యవసాయ పనులు చేస్తూ మరొకరు



జీల సతీశ్(ఫైల్)



ఆంజనేయులు మృతదేహం

చిగురుమామిడి/గన్నేరువరం: కరీంనగర్ జిల్లాలో శుక్రవారం గుండెపోటుతో ఇద్దరు యువకులు మృతిచెందారు. క్రికెట్ ఆడుతూ ఒకరు, వ్యవసాయ పనులు చేస్తూ మరొకరు హఠాత్తుగా చనిపోవడం విషాదం నింపింది. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామానికి చెందిన శనిగరం ఆంజనేయులు(37)గ్రామపరిధిలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నీలో సమీప బంజేరుపల్లి టీం తరఫున క్రికెట్ ఆడేందుకు వెళ్లాడు. రెండు ఓవర్లు బౌలింగ్ చేశాడు. మూడో ఓవర్‌లో రెండు బాల్స్ వేసి కుప్పకూలిపోయాడు. తోటి క్రీడాకారులు ఫిట్స్ వచ్చిందనుకుని తాళం చేతుల గుత్తి చేతిలో పెట్టారు. నోటి నుంచి నురగలు రావడంతో సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించేలోపే ఆంజనేయులు మృతి చెందినట్లు తెలిపారు. ఆంజనేయులు కట్టుమిషన్ కుడుతూ జీవనం సాగించేవాడు. ఇతడికి భార్య ధనలక్ష్మి, తల్లి మల్లవ్వ ఉన్నారు. కాగా, హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఆంజనేయులు మృతదేహాన్ని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ సందర్శించి నివాళి అర్పించారు. మృతుల కుటుంబసభ్యులకు ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. అదే విధంగా గన్నేరువరం మండలం సాంబయ్యపల్లె గ్రామానికి చెందిన జీల సతీశ్(32)తనకున్న పొలంలో వివిధ పంటలు సాగుచేస్తూ, ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శుక్రవారం మొక్కజొన్న పంటకు నీళ్లు పారించేందుకు వెళ్తుండగా పొలానికి సమీపంలో గుండెపోటు రావడంతో కిందపడపోయాడు. అటుగా వెళ్తున్న రైతులు గమనించి స్థానిక వైద్యుడి వద్దకుతీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య కవిత, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేటకు చేరిన జనచైతన్య యాత్ర



ప్రకాశ్‌కు స్వాగతం పలుకుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ మార్చి 10న భద్రాచలంలో ప్రారంభమైన జనచైతన్య యాత్ర శుక్రవారం మండలకేంద్రానికి చేరుకుంది. తెలంగాణ రాష్ట్రమంతా అడవి ప్రాంతాల గుండా మైదాన ప్రాంతంలో ప్రజలను చైతన్యవంతులుగా చేస్తూ ఈ యాత్రను కొనసాగిస్తున్నానని తూతిక ప్రకాశ్ తెలిపారు. బైక్ యాత్రలో భాగంగా ఎల్లారెడ్డిపేటకు చేరుకున్న తూతిగా ప్రకాశ్‌ను బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు బండారి బాల్ రెడ్డి, వీర్నపల్లి మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, బీఆర్ ఎస్ సీనియర్ నాయకులు వాసర వేణి దేవరాజు, ప్రమోద్, బంటి గౌడ్ , శరవింద్, ఎలగందుల బాబు, గణేశ్, యూత్ అధ్యక్షుడు దొనుకుల కల్యాణ్ , పుల్లక్ వంశీ గౌడ్ ఉన్నారు.

ఎల్లలు దాటిన ఒగ్గుకళ



ప్రదర్శనలో కళాకారులు

వేములవాడ రూరల్ : ఒగ్గు కళాకారుల నైపుణ్యం ఎల్లలు దాటింది. వేములవాడ మండలంలోని అచ్చన్నపల్లికి చెందిన గాజర్ల కొమురయ్య ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వ భాషా, సాంస్కృతిక శాఖ సమైక్య సంయుక్త సహకారంతో ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ సరిహద్దులోని ఝాన్సీ సమీపంలోని ఒర్చాలో కళాప్రదర్శనను నిర్వహిస్తున్నారు. రెండ్రోజులుగా జరిగే ఈ ఉత్సవాలకు దేశ విదేశాల నుంచి పెద్దఎత్తున భక్తులు హాజరవుతారు.

నిరుద్యోగుల జీవితాలతో ఆడుకోవద్దు

- టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకులపై సీబీఐ విచారణ చేపట్టాలి
- వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము



సిరిసిల్లలో వైఎస్సార్‌టీపీ కాగడాల ర్యాలీ

సిరిసిల్లటౌన్: లక్షలాది నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వాలు ఆడుకోవద్దని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము కోరారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకులపై శుక్రవారం రాత్రి సిరిసిల్లలో కాగడాల ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ పేపర్ల లీకుల అంశాన్ని తేలిగ్గా తీసుకోవద్దని, సీబీఐ విచారణ చేపట్టాలని కోరారు. ఎన్నికల హామీ నిరుద్యోగ భృతి ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో 1.90లక్షల మంది ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి అనుముల శ్రీకాంత్‌రెడ్డి, వంగరి అనిల్, మ్యాన లక్ష్మీనారాయణ, బిగుళ్ల హరీశ్, పూర్మాణి కరుణాకర్‌రెడ్డి, గజ్జుల శ్రీధర్, కారంపురి రవి, గూడెల్లి రాజ్‌కుమార్, ఆకెన సత్తయ్య, చీకోటి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

- ఎమ్మెల్యే రమేశ్‌బాబు



ఆలయ డీఈతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేములవాడ: వేములవాడ రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, బద్దిపోచమ్మ గుడి వద్ద బోనాల మంటపం, గుడిచెరువు సుందరీకరణ, వేద, నృత్య, సంగీత, సంస్కృత కళాశాలల పనులపై ఎమ్మెల్యే రమేశ్‌బాబు శుక్రవారం సమీక్షించారు. ఆలయ మాస్టర్‌ప్లాన్‌పై డీఈ రఘునందన్‌తో చర్చించారు. రూ.10 కోట్లతో బోనాల మంటపం, షాపింగ్‌కాంప్లెక్స్, రూ.12 కోట్లతో గుడిచెరువు సుందరీకరణ, రూ.90 లక్షలతో గుడిచెరువులో శివార్చన వేదిక, బద్దిపోచమ్మ గుడి ప్రాంతంలో సేకరించిన స్థలంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. రూ.5కోట్లతో మినీ స్టేడియం పనులు పూర్తి చేయిస్తామన్నారు.

అత్తింటి వారిపై కేసు

సిరిసిల్ల క్రైం : అదనపు కట్నం కోసం తన భర్త వేధిస్తున్నాడని ఓ మహిళ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణం గీతానగర్‌కు చెందిన మమతకు కరీంనగర్‌కు చెందిన కుర్ర కిషన్‌తో 2017లో వివాహమైంది. అదనపు కట్నం కోసం తన భర్త వేధింపులకు గురిచేస్తున్నాడని, మమత ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త కిషన్‌తోపాటు అత్త రాజేశ్వరి, మామ కనుకయ్య, బావ కుర్ర వెంకటేశ్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ అనిల్ కుమార్ తెలిపారు.

భర్త వేధిస్తున్నాంటూ..

తాగుడుకు బానిసైన తనను భర్త వేధిస్తున్నాడంటూ ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. శాంతినగర్‌కు చెందిన పద్మకు వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన చెన్న శ్రీనివాస్‌తో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు ఉన్నాడు. భర్త నిత్యం తాగివచ్చి వేధిస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ అనిల్‌కుమార్ తెలిపారు.

శ్రీనివాస్‌కు నివాళి



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చాడ వెంకటరెడ్డి

సిరిసిల్లటౌన్: సీపీఐ సీనియర్ నాయకుడు బూర శ్రీనివాస్ మృతి కార్మిక వర్గానికి తీరని లోటని అని సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం మృతుడి కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేద ప్రజలు, బీడీ కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన చేసిన పోరాటాలను గుర్తు చేశారు. ఇక్కడ సీపీఐ నాయకులు పంతం రవి, కదారి రాములు, మంద సుదర్శన్, జాన్సన్, చంద్రమౌళి, తదితరులున్నారు.